www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 27 | నవంబర్ | 2025 పేజీలు : 8

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

## -మొదటి విడతలో 192 పంచాయతీలకు ఎన్నికలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభం కానుంది. రిటర్నింగ్ ఆఫీసర్లు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈనెల 29 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా ఈనెల 30న నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ ఒకటిన అప్పీళ్ల స్వీకరణ, నామినేషన్ల ఉప సంహరణకు డిసెంబర్ మూడున మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు విధించారు. అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు. డిసెంబర్ 11న మొదటి విడత ఎన్నికలు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. మొదటి విడతలో కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని 192 సర్పంచ్ స్థానాలకు, 1740 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 1740 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

మిగతా 2లో..

# సైన్స్ ఫెయిర్ ప్రదర్శన ప్రతీ విద్యార్థి వరకు చేరాలి





## - ఎంఎల్ఏ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 53వ జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన ప్రతీ విద్యార్థి వరకు చేరాలని, ఇందు కోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లాకేంద్రంలో రెండు రోజు పాటు ఏర్పాటు చచేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జిల్లాలో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, తద్వారా విద్యార్థుల్లో వైజ్ఞానిక పరిజ్ఞానం, తాత్విక ఆలోచన, సృజనాత్మకంగా పెంపొందుతాయని అన్నారు. నేడు ప్రపంచం ఉపయోగిస్తున్న టెక్నాలజీ విద్యార్థుల ప్రయోగశాల ద్వారా అభివృద్ధి పొందిందని తెలిపారు. విద్యార్థులు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ప్రయోగాత్మక విద్యను అభ్యశించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ మధురవాణి, మాధవరావు, సతీష్, సైదులు, నాగరాజ శేఖర్, నీరజతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉద్యమంపై చెరగని సంతకం పోటు ప్రసాద్

## -నిబద్ధతకు నిలువుటద్దం
## -నేడు పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** పుట్టుక ఎంత సహజమో మరణం అంతే సహజమని జనన మరణాల మధ్య ఉన్న జీవిత కాలమే గుర్తింపునిస్తుందని నమ్మె అతి కొద్ది మందిలో పోటు ప్రసాద్ ఒకరు. చేతనైతే సాయం చేయడం తప్ప అపకారం తలపెట్టని గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం. విద్యార్థి సంఘ నాయకునిగా, కార్మిక నేతగా, ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ రథసారధిగా అనేక ఏళ్ల పాటు ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహించి అట్టడుగు వర్గాలకు దన్నుగా నిలిచిన పోటు ప్రసాద్ మరణించి ఏడాది గడిచిపోయింది. కానీ ఆయన జ్ఞాపకాలు కమ్యూనిస్టు కార్యకర్తల మదిలో మెదులుతూనే ఉన్నాయి. ఆయన మాట తీరు, ఆయన కార్యాచరణ , నిజాయితీ నిరంతరం స్పురణకు వస్తాయి. పోరాడాల్సి వస్తే విజయం దక్కే వరకు పోరాడే ఆయన తత్వం, సాయం చేయాల్సి వచ్చినప్పుడు ముందు వరుసలో నిలిచే ఆయన దాతృత్వం ఎన్నటికి మరుపురానిది అందరికి ఆదర్శం కూడా. ఒక సంపన్న రైతు కుటుంబంలో జన్మించిన ఆయన

మిగతా 2లో..

# పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



## -ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు
## -నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు
## -రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణికుముదిని తెలిపారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాణికుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామానికి అప్‌డేట్ చేసిన రిజర్వేషన్లు ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ వివరాలు వెంటనే టిపోల్ వెబ్‌సైట్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. టిపోల్ వెబ్‌సైట్ , ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో మాట్లాడుతూ టిపోల్‌లో రిజర్వేషన్, పోలింగ్ లోకేషన్, పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. 63 క్లస్టర్ల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలలో మొదటి ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల, ఓటరు జాబితా, గ్రామాల్లోని

మిగతా 2లో..

# రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

## -ఖమ్మంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన




**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు తెలిపారు. ఢిల్లీలో రైతు ఉద్యమం ప్రారంభమై ఐదు సంవత్సరాలైన సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘాల సమన్వయ కమిటీ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా తోట రామాంజనేయులు, కళ్యాణం వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు కొండపర్తి గోవిందరావు, బొంతు రాంబాబు, పొన్నం వెంకటేశ్వరరావు, కోల్లేటి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ రైతు ఉద్యమం

మిగతా 2లో..

# జిల్లా ఉద్యమంపై చెరగని సంతకం పోటు ప్రసాద్

(మొదటిపేజీ తరువాయి)

ఏనాడు దాబు, దర్పాన్ని ప్రదర్శించ లేదు. వంద ఎకరాల భూస్వామి పోటు రాఘవయ్య కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ కేవలం కుటుంబ వారసత్వాన్నే కాదు పార్టీ వారసత్వాన్ని స్వీకరించాడు. నాయ నమ్మ యర్రమ్మ, తండ్రి రాఘవయ్య నుంచి ఉద్యమ ఓనమాలు దిద్దు కున్న ప్రసాద్ సిపిఐలో అంచలంచెలుగా ఎదిగాడు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో చిన్న మచ్చ కూడా లేని ఆయన కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ గతేడాది నవంబర్ 27న గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మరణ వార్త అనేక హృదయాలను ద్రవింపజేసింది. ఆయన స్వగ్రామం ఇప్పటి సూర్యాపేట జిల్లా వెలిదం డ రంగాపురం. రాజకీయ కక్షల నేపథ్యంలో ఆ గ్రామంలో ఉన్న ప్రసాద్ కుటుంబ భూములను కొంత మంది దున్ననివ్వలేదు. కుటుంబం మొత్తాన్ని హతమార్చేందుకు ఇల్లు కూల్చడం మొదలు అన్ని ప్రయ త్నాలు చేశారు. ఆ దశలో ఒక పక్క చదువుకుంటూనే మరోపక్క ఖమ్మం నగరంలో ట్రాక్టర్ కిరాయికి నడుపుతూ కుటుంబాన్ని పోషించారు. నాయనమ్మ యర్రమ్మది వీరోచిత గాథ. సాయుధ తెలంగాణ పోరాట కాలంలో శిరోముండనం చేసి ఊరేగించిన కమ్యూనిస్టు నాయకుల జాడ చెప్పని ధీశాలి. యావత్ పోటు ప్రసాద్ కుటుంబం కమ్యూనిస్టు పార్టీలో నిబద్ధతతో పని చేస్తూ నికార్సయిన కమ్యూనిస్టులుగా ఉన్నా రంటే అతిశయోక్తి కాదు. ఒక దశలో ప్రసాద్ సోదరుడు రమేష్‌ను హత మార్చేందుకు ప్రయత్నించారు. అప్పుడు రమేష్ తీవ్ర గాయాలపాల య్యాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రసాద్ కుటుంబం చేసిన త్యాగాలు అజరామరం. కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఖమ్మం జిల్లా ఉద్య మంపై ప్రసాద్‌ది చెరగని ఓ సంతకం. కమ్యూనిస్టు పార్టీ శ్రేణులను కది లించడంలోనూ, పార్టీ వైపు ఆకర్షించడంలోనూ ప్రసాద్‌ది ఒక ప్రత్యేక శైలి. కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడం, యువతకు ప్రధాన బాధ్యతలు అప్పగించి పార్టీలో ఇనుమడింపజేయడంలోనూ ఆయన కృ షి సదా అనుసరణీయం. ఒక బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ బా ధ్యతలో తలమునకలైన వేళ పోటు ప్రసాద్ ఆకస్మికంగా మృతి చెందా రు. ఆయన ఆలోచనలు అద్భుతం. సిపిఐ జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలన్న ఆయన తలంపు నెరవేరక ముందే కన్ను మూశారు. ప్రస్తుత ఖమ్మం జిల్లా సమితి ప్రసాద్ ఆశయ సాధనలో భాగంగా శతాబ్ది ఉత్సవ ముగింపు సభను ఖమ్మంలో నిర్వహిస్తూ ప్రసాద్ ఆశయ సాధనలో పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ప్రసాద్ కుటుంబం ముఖ్యంగా సహధర్మచారిణి నిర్మల, ఇతర కుటుంబ సభ్యులు ప్రసాద్‌కు అందించిన సహకారం కూడా మరువ లేనిది. నిజా యితీకి నిలువుటద్దంగా నిలువెల్లా కమ్యూనిస్టు భావాజాలాన్ని నింపు కుని మాట, చేత, ఆలోచన కమ్యూనిస్టు పురోభివృద్ధే లక్ష్యంగా సాగిన ప్రసాద్ అజరామరుడు. కమ్యూనిస్టు ఉద్యమ స్మృతిపథంలో ఎప్పటికి ఓ ధృవతారల నిలిచిపోతాడు. ఆయన ఆశయ సాధనలో ముందుకు సాగడం కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ సభ ముగింపు సంబురాలను పోటు ప్రసాద్ ఆలోచనలతో జయప్రదం చేయడమే ప్రథమ వర్థంతి వేళ మనమిచ్చే ఘన నివాళి.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

మొదటి, రెండు, మూడవ దశ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు సంబంధించి 566 మంది రిజర్వింగ్ అధికారులను, 3,442 మంది పోలింగ్ అధికారులను, 4,217 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించారు. 15 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 15 మంది స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు, 76 మంది జోనల్ అధికారులు, 25 మంది టివోటి, 244 మంది బూత్ అధికారులను నియమించారు. 20 డిస్ట్రిబ్యూట్ సెంటర్లు, 191 రిసెప్షన్ కేంద్రాలు, 566 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 648 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

# పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

మూడు ప్రాముఖ్య ప్రదేశాల్లో అతికించడం, స్థానికంగా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ర్యాలీలు, ఇతర సభ్యుల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం మార్కింగ్ చేయాలన్నారు. ఎన్నికల వ్యయ వివ రాల నమోదు కోసం వెయిట్ లిస్ట్ ఫైనల్ చేసి పోటీ చేసే అభ్యర్థులకు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు నోటీసులు జారీ చేయాలని అనుమ తులు లేకుండా ఎటువంటి రాజకీయ సంబంధ నోటీసుల ముద్రణలు చేయవద్దన్నారు. కలెక్టరే ట్‌లో జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రకటనలకు ముందుగా ఎపి ఎంసి అనుమతి తీసుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ, పోలింగ్ వివరాలు ఇతర ఎన్నికలకు సంబంధించిన వివరాలు ప్రతి మండలం నుంచి అప్‌డేట్ చేసేవిధంగా వ్యవస్థ ఏర్పాటు చేయా లని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రచారంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ సిబ్బంది, అధికా రులు, పోలింగ్ సిబ్బంది, ఉద్యోగులు భాగస్వామ్యం కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిపివో ఆశా లత, డిఆర్‌డివో సన్యాసయ్య, ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్డివో నర్సింహారావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

(మొదటిపేజీ తరువాయి)

380 రోజుల పాటు సాగిందన్నారు. రైతులకు వ్రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దొడ్డి దారిన విద్యుత్ ప్రైవేటీక రణ, వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుంద న్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌ల రూపంలో కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. రైతులు, కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది అధిక వర్షాలకు పంట దిగుబడి తగ్గి రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పండిన కాస్తో కూస్తో పంటను కొనేందుకు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల పేరుతో రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వెంటనే నిబంధనలను సడ లించి పత్తి కొనుగోలు చేయాలన్నారు. విదేశాల నుంచి సుంకం లేకుండా పత్తి దిగుమతి చేసుకునే విధానానికి స్వస్తి పలకాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు దొండపాటి రమేష్, వెంకట్రామిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు




తాటి వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాస రావు, బండెల వెంకయ్య, కార్మిక సంఘాల నాయకులు బిజి క్లెమెంట్, గాదె లక్ష్మి నారాయణ, శివరామకృష్ణ, తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, విష్ణు, జి. రామయ్య, సివై పుల్లయ్య, ఉపేందర్, సీతామహాలక్ష్మి, రాజ్యం, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె మీరా, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, పాశం అప్పారావు, లక్ష్మి నారాయణ, యాదగిరి, బిక్కసాని గంగాధర్, బోడేపూడి వీరభద్రం, సత్యం, యనమద్ది రామకృష్ణ, సంక్రాంతి నర్సయ్య, చాంద్ పాషా, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. బుధవారం ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డి తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖమ్మం నగరంలోని 60వ డివి జన్ రామన్నపేటలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి లు ఆశీ ర్వదించారు. పలు గ్రామాల్లో పర్యటించి ఇటీవల మరణించిన పలు కుటుంబాలను పరామ ర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం డిసిసి అధ్యక్షురాలుగా నియమితులైన తోట దేవి ప్రసన్న కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# తల్లాడలో కంఠమహేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన





**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ పట్టణంలో గౌడసంఘం ఆధ్వర్యంలో శ్రీ సురమాంబ, కంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి బుధ వారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామివారి శంకుస్థాపన కార్యక్రమంలో నిర్వహించే శంఖుని ఊరేగింపుగా పురవీ ధుల్లో తిరిగారు. అనంతరం శంఖుని అందరు కలిసి పాలభిషేకం నిర్వ హించారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమం పూజారుల వేదమం త్రాల తో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ నీలాద్రి ఆలయ డైరె క్టర్ పెరిక నాగేశ్వరరావు(చిన్నాబ్బాయి), మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, ముక్కు బసవయ్య, అనుమోలు కృష్ణ, ఇజ్జగాని గోవింద రావు, మొక్క కృష్ణ, గుండ్ల నాగయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, రామల క్ష్మణ్, పెరిక కిరణ్, మొక్క సైదులు, సమ్మెటరామకృష్ణ, పెరిక అప్పయ్య, పెరిక శ్రీనివాసరావు, మొక్క రాంబాబు, పెరిక క్రాంతి, సున్నం తిరుపతిరావు, ఇజ్జగాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన చాంబర్ నూతన పాలక వర్గం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన పాలక వర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాల యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కురువెళ్ల ప్రవీణ్‌కు మార్, ప్రధాన కార్యదర్శి సోమా నర్సింహారావు (జివై నరేష్), ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహా రావు, సహాయ కార్యదర్శి బాదె



రమేష్, కోశాధ్యక్షులుగా తల్లాడ రమేష్ లు బాధ్యతలు స్వీకరించారు. సెంట్రల్ ఈసి సభ్యులుగా మాటేటి కిరణ్‌కుమార్, రాయపూడి రవికుమార్, వంగవీటి హరీష్, సుఖాసి శేషగిరిరావు, పొట్ల రామనాథం లు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కొప్పు నరేష్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శులు మెంతుల శ్రీశైలం, గుర్రం ఉమా మహేశ్వరరావు, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, వివిధ శాఖల అధ్యక్ష, కార్యద ర్శులు, కార్యవర్గ సభ్యులు, సర్వసభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా దిగుమతి శాఖకు నూత నంగా ఎన్నికైన అధ్యక్షులు వడ్డె వెంకటేశ్వరరావు, కార్యదర్శి యర్రా అప్పారావు, కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫీస్ బేరర్స్, సెంట్రల్ ఈసి సభ్యులు, దిగుమతి శాఖ సభ్యులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దీక్షదారులకు వంట గిన్నెల వితరణ

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలోని అయ్యప్ప దీక్ష దారులకు శ్రీనివాస మినరల్ ప్లాంట్ ప్రొప్రైటర్ నరేడ్ల శ్రీను సరస్వతీ దంప తులు వారి కుమార్తెలు అర్చన, రచన, కీర్తనలు సుమారు 13వేల రూపాయల వ్యయంతో స్వాములకు గిన్నెల సెట్టును వితరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండల కేంద్రంలో సుమారు 40 నుండి 60 మంది స్వాముల వరకు అయ్యప్ప దీక్ష తీసుకుంటున్నారని, వారు ప్రతి రోజు బిక్ష ఏర్పాటు చేసుకునే క్రమంలో వంట గిన్నెల కోసం టెంట్ హౌస్ వారి దగ్గర రెంటుకు తీసు



కోవడం జరుగుతుందని అయ్యప్పలకు ప్రత్యేకంగా వంట గిన్నెలు ఉండాలని వారికి హితోదకంగా అందజేయడం జరిగింద న్నారు. ఈ క్రమంలో దీక్షాదారులకు సొం తంగా వంట గిన్నెలు ఉండాలని భావించి అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్ర మంలో గురుస్వాములు పానుగంటి వెంకటేశ్వర్లు, ఎం సదానంద చారి, కే యుగంధర్, బోడకుంట బిక్ష, కసనబోయిన వెంకన్న, జగన్ స్వాములు, రంజిత్, వినోద్, సాయిరాజ్, సతీష్, అడపా సాయి కుమార్, చంద్ర, హరిబాబు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలను నిస్సారం చేయొద్దు

**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పంట పొలాల్లో పత్తి, వరి కొయ్యలను తగులబెట్టి సారవంతమైన భూమిని నిస్సారం చేయొద్దని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య రైతులకు సూచించారు. మండల పరిధిలోని చింతగుర్తి, పరికలబోడు తండా లో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. సాగు చేసిన పొలాల్లో వ్యర్థాలను తగలబెడుతున్న రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి, వరి కోయ్యలను తగలబెట్టడం వల్ల భూమి సారవంతం కోల్పోయి నిస్సారం అవుతుందని తెలిపారు. భూమిలో పంటలకు మేలు చేసే బ్యాక్టీరియా నశించిపోతుందని తెలిపారు. మిర్చిలో తక్కువ రసాయనాలు వాడాలని సూచించారు. విత్తన మొక్కజొన్న సాగుకు సంబంధించి సంబంధిత కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి దెబ్బతిన్నదని తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరణ్మయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఊర్లో గెలిచేది ఎర్రజెండానే..

**- మరోసారి సై అంటున్న సిపిఐ, సిపిఎం**

**- ఎర్రజెండాని మాత్రమే ఆదరిస్తున్న మల్లవరం గ్రామ ప్రజలు**

**ప్రజాపక్షం/మధిర :** దేశంలో రోజురోజుకి కమ్యూనిస్టులు అవసరం పెరుగుతుందని పదే పదే కమ్యూనిస్టు నేతలు చెబుతున్న మాట ఇది. ఈ గ్రామాన్ని చూస్తే ఆ మాట నిజమనే అనిపిస్తుంది. ఖమ్మం జిల్లా మధిర మండల పరిధి మల్లవరం గ్రామంలో సుమారు వెయ్యి ఓట్లు ఉన్న ఆ గ్రామంలో సిపిఐ, సిపిఎంను మాత్రమే గ్రామ ప్రజలు ఆదరిస్తారు. గ్రామ సమస్యలు ఎర్రజెండాతోనే పరిష్కారం అవుతాయని భావించిన గ్రామ ప్రజలు ఎర్రజెండా వైపే మొగ్గు చూపుతున్నారు. మిగితా పార్టీలకు అక్కడ నామ మాత్రమే ప్రాధాన్యత ఉంది. అయితే గత ఎన్నికల్లో మల్లారం పంచాయతీని సిపిఎం గెలుచుకోగా మల్లవరం, రొంపిమళ్ళ, జాలిముడి, రామచంద్రపురం నాలుగు గ్రామాల కలిపి ఒక ఎంపిటిసి ఉండగా ఆ స్థానాన్ని సిపిఐ గెలుచుకుంది. మల్లవరం గ్రామంలో ప్రధాన పోటీ సిపిఐ సిపిఎం మధ్య ఉండగా మిగితా పార్టీలు ఆ పార్టీలతో కలిసి స్థానిక ఎన్నికలకు వెళ్లే పరిస్థితి కన్పిస్తుంది. ఈసారి మల్లవరం సర్పంచ్ స్థానాన్ని సిపిఐ కైవసం చేసుకోవాలని చూస్తుంది. ఇదే క్రమంలో సిపిఎం కూడా మరోసారి పంచాయతీ మీద కన్నేసింది. సిపిఐ నుంచి మాజీ ఎంపిటిసి సిపిఐ రాష్ట్ర నాయకులు అమరజీవి మందడపు నాగేశ్వరరావు సతీమణి రైతు సంఘం జాతీయ కౌన్సిల్



సభ్యులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి ఈ సారి బరిలోకి దిగనున్నారు. మరోవైపు సిపిఎం సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మందడపు ఉపేందర్ సతీమణి మందడపు లక్ష్మి బరిలో ఉండనున్నారు. ఇక ఇరు పార్టీలు క్యాడర్ ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఏది ఏమైనా అక్కడ గెలిచేది మాత్రం ఎర్రజెండానే అనేది అర్థం అవుతుంది.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏసిపి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కల్లూరు ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ ఆఫీసర్ వసుంధర యాదవ్ పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీల చేస్తున్నారు. బుదవారం కల్లూరు డివిజన్ పరిదిలోని ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ రికార్డులను సమీక్షించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను ధృవీకరించారు. సిసిఎన్ టి ఎస్ 2.0, ఈసమ్మన్స్, టిఎస్ సిఓపి లను కఠినంగా ఉపయోగించాలని సిబ్బందిని ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న ఎఫ్.ఐ.ఆర్ లను పరిశీలించి, చురుకైన పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని, రౌడీ అంశాలు, హిస్టరీషీటర్లపై నిఘా ఉంచాలని బృందాన్ని ఆదేశించారు. సమర్థవంతమైన క్షేత్ర పర్యవేక్షణ కోసం కానిస్టేబుళ్లను గ్రామ పోలీసు అధికారులు (విఓపిలు)గా నియమించాలని ఆమె ఎస్.హెచ్.ఓని ఆదేశించారు. స్థానిక నిఘాను బలోపేతం చేయడానికి సీసీటివి కెమెరాల ఏర్పాటు కోసం కమ్యూనిటీ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించాలని కూడా ఏసిపి సిబ్బందిని ఆదేశించారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించబడిన




మొబైల్ ఫోన్‌లను త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆమె చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిమితులను సందర్శించి, దానిని పూర్తిగా తనిఖీ చేశారు.ఆమె వెంట రూరల్ సిఐ ముత్తులింగం ఉన్నారు.

# ఎన్నికల ప్రశాంతతపై అవగాహన సదస్సులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రశాంతతపై అవగాహన సదస్సులు కల్లూరు ఎస్సై హరిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. స్థానిక సమరం లో వివాదాలు లేకుండా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించుకోవాలని ఓటర్లను కోరారు. ఓటు వినియోగ సమయంలో అల్లర్లను సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని అలాంటి కేసులు నమోదైతే శిక్ష పడే అవకాశం ఉందని ఎస్సై పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎలాంటి వివాదాలు లేకుండా ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే మంచిదని వివరించారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, లింగాల, పేరువంచ, చంద్రుపట్ల, మర్లపాడు ఇలా ప్రతిరోజు నాలుగు గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామాలలో ఓటర్లు, ప్రధాన రాజకీయ పార్టీల వారు తో నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసులు శిక్షలు పడతాయని జీవితంలో నేర చరిత్ర ముద్ర పడుతుందని ఓటు అనే ఆయుధాన్ని ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు పట్ల అప్రమత్తంగా ఉండాలని దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు వ్యక్తిగత విమర్శలు చేసుకోవద్దని వివరిస్తున్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తున్నట్లు గ్రామాల్లో సమస్యలు వారికి తెలియపరచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు సత్యంబాబు, పోటు అర్జున్ రావు, కిరణ్, ఆయా గ్రామాల ఓటర్లు పాల్గొన్నారు.

# మధిరలో పర్యటించిన మంత్రి పొంగులేటి, ఎంపి రఘురాంరెడ్డి

**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి బధవారం మధిరలో పర్యటించారు. పర్యటనలో భాగంగా ముందుగా రెడ్డి గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం ఎస్సీకాలనీ నందు పూర్ణకంటి విజయరాణి కుమారుడు మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. పొంగులేటి వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కోట రాంబాబు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, దేవిశెట్టి రంగారావు, కటికల సీతారాంరెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, చావలి రామరాజు, శీలం వీరవెంకటరెడ్డి, మొగిలి అప్పారావు, ఐలూరి జనార్ధన్‌రెడ్డి, బాణోతు రమణ, బండి వెంకటేశ్వర్లు, సోమా రవికాంత్, తమిశెట్టి బాలకృష్ణ, చిలకా సత్యం తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు హెడ్‌క్వాటర్స్‌లో రాజ్యాంగ దినోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రం లోని పోలీసు హెడ్‌క్వాటర్స్ పెరడ్ గ్రౌండ్స్‌లో ఆశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం నిర్వహించారు. పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు అడిషనల్ డిసిపి ఏఆర్ కుమారస్వామి, ఏఆర్ ఏసిపి సునిల్‌సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞా చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగ ఔనత్యాన్ని తెలుసుకోవాల్సిన భాద్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతి ఏటా రాజ్యాంగాన్ని అమోదించిన నవంబర్ 26 ను భారత రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, పాలకులు, ప్రభుత్వాలు రాజ్యాంగంలో పొందపరిచిన ఆర్టికల్స్ ఆధారంగా హక్కులు, విధులను నిర్వర్తించటంతో పాటు పాలన కొనసాగించవలసి ఉంటుందన్నారు.



# ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి కార్యక్రమం

**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు వెనుక భాగంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వ స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి ఘనంగా నిర్వహించారు. శ్రీమాను శేషాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. నాగేంద్ర స్వామిని దర్శించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలో నేటి నుండి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని మధిర మండల తహశీల్దార్ ఆర్.రాంబాబు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మధిర మండలంలో మొత్తం ఎనిమిది క్లస్టర్ల నుండి నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ వేసే వ్యక్తులు స్వయానా నామినేషన్ దాఖలు చేయాలని, ఏ ఇతరుల నుండి నామినేషన్లు స్వీకరించబడవని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పోటీ చేసే వ్యక్తి నిబంధనలకు లోబడి కొత్త అకౌంట్‌ను ఓపెన్ చేసి ఆ అకౌంట్ డీటెయిల్స్ అప్పడవిత్ నామినేషన్ అప్లికేషన్ పూర్తిగా పూర్తి చేయాలన్నారు. సర్పంచ్ పోటీ చేసే జనరల్ కేటగిరి సంబంధించి రూ. 2000, ఎస్సీ, ఎస్టీ బిసి రూ.1000, వార్డు మెంబర్‌కు పోటీ చేసే వారు జనరల్ కేటగిరికి రూ.500 ఎస్సీ, ఎస్టీ బిసి రూ.250 నామినేషన్ రోజు చెల్లించాలని తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు ఎన్నికల నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వారు సూచించారు.



# నూతన దంపతులను ఆశీర్వదించిన సండ్ర

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రాచర్ల మోహన్‌రావు (ఆటో బాబాయ్), లక్ష్మి (లేటు) దంపతుల కుమారుడు రాచర్ల చంద్రశేఖర్, ఉషా రాణిల వివాహం ఇటీవల జరగ్గా బుధవారం సత్తుపల్లిలో పర్యటించిన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వారి నివాసానికి చేరుకుని నూతన దంపతులు చందు, ఉషలను కలుసుకుని ఆశీర్వదించారు. సండ్ర వెంట కొత్తూరు ఉమామహేశ్వరరావు, మల్లూరు అంకమరాజు, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, మేకల నర్సింహరావు, వెంకటరత్నం, అనురాధ తదితరులున్నారు.



## బార్ షాప్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** బార్ షాప్ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వీరికి కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, ఆర్ లక్ష్మీ నారాయన సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన బార్ షాప్ మీటింగ్ పగిడయ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బార్ షాప్ కార్మికులు అతి తక్కువ వేతనతో చాలి చాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారని, వీరికి కనీస వేతనం ఇవ్వాలని, వీరు కనీసం నిలువ నీడ కూడా లేని పరిస్థితి ఉందని, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఉందని, కావున ప్రభుత్వం వీరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని,ఉచిత గ్యాస్, ఉచిత కరెంటు,ఇలా ప్రభుత్వ పథకాలు వీరికి అందించాలని వారు డిమాండ్ చేశారు. డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో జరుగు సిపిఐ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, గౌరవ అధ్యక్షుడు తోట రమేష్, బార్ షాప్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి బోసెట్టి సంపత్, పుసికెల కొండయ, పగిడయ, లక్ష్మ ణ్, రవి, నల్లమోదు వెంకటేశ్వర్లు, నర్సయ్య, వెంకన్నసీను పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేసిన సీఎం రేవంత్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రిజర్వేషన్లు అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ను ప్రభుత్వం ఇప్పుడేందుకు దాటవేస్తున్నదని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం మీడియాతో గిరిబాబు మాట్లాడుతూ రిజర్వేషన్ అమలు చేయకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్తున్న ఈ ప్రభుత్వాన్ని బీసీలు బొందపెట్టడం ఖాయమన్నారు. ఓట్ల కోసమే ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తున్నదని విమర్శించారు. కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలతో పాటు తులం బంగారం, చదువుకున్న విద్యార్థులకు స్కూటీలు, మహిళకు రూ.2500, రూ.4 వేల పింఛన్, ఆటో డ్రైవర్లకు రూ. 12వేలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. హామీల అమలులో ప్రభుత్వం విఫమైందని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను భ్రష్టపట్టించి, రాష్ట్రాన్ని దివాళా తీశారన్నారు. రాష్ట్రాభివృద్ధిని సీఎం గాలికొదిలేశారని, రెండేండ్లలో ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కేసీఆర్ కట్టించిన భవనాలకు రేవంత్ రిబ్బన్ కట్ చేస్తున్నారని గిరిబాబు మండిపడ్డారు.

## ప్రతీ కేసును తక్షణమే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ఏన్కూరు :** పోలీస్ స్టేషన్కు వచ్చిన ప్రతి కేసును తక్షణమే పరిష్కరించాలని కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. నూతనంగా కల్లూరు ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఆమె మొట్టమొదటిసారిగా స్థానిక పోలీస్ స్టేషన్ ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల రిజిస్టర్లు, వివిధ కేసులో ఉన్నటువంటి వాహనాలను, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆమె పరిశీలించారు. పోలీస్ సిబ్బందిని గ్రామాల్లో ఎటువంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయని అడగగా సిబ్బంది భార్యాభర్తల కేసులు, పొలం గట్టు పంచాయతీలు ఎక్కువగా వస్తుంటాయని సిబ్బంది తెలిపారు. అదేవిధంగా సిబ్బంది అన్ని గ్రామాలపై దృష్టి ఉంచాలని ఆమె అన్నారు. అంతేకాకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకుల గురించి తెలుసుకోవాలన్నారు. ఎలాంటి చిన్న కేసు సిబ్బంది దృష్టికి వచ్చిన ఎస్ హెచ్ఓ దృష్టికి తప్పనిసరిగా తీసుకురావాలని ఆమె కోరారు. పంచాయతీ ఎన్నికలు రానున్నాయని ఈ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అలర్ట్ గా ఉండాలని ఆమె కోరారు. అనంతరం ఆమె మండల సరిహద్దులైన జన్నారం, తిమ్మారావుపేట, హిమాంనగర్ గ్రామాలను ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు రూరల్ సీఐ ముత్తిలింగం, ఏన్కూర్ ఎస్సై నారబోయిన సంధ్య, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీహరి, రాజేందర్, పోలీస్ సిబ్బంది రవి, శంకర్, వెంకటేష్, దేవేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గంగారంలో గల 15వ పోలీస్ ప్రత్యేక పటాలము నందు ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పటాలం కమాండెంట్ యన్. పెదబాబు హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదితమైన రోజు నవంబర్ 26ను గుర్తుచేసుకుంటూ, రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, బాధ్యతలు, కర్తవ్యాలపై అవగాహన పెంపుతో దేశ భద్రత, శాంతి సమాధానాల పరిరక్షణలో పోలీసు విభాగం పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ప్రతి సిబ్బంది రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులు కర్తవ్యాలను గౌరవిస్తూ సేవ చేయాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అంజయ్య , మినిస్ట్రియల్ స్టాఫ్ ఆర్ఐ లు, అర్ఎస్ ఐ లు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో నీటి కష్టాలు..!







**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ బలోపేతానికై అనేక లక్ష రూపాయల నిధులు కేటాయించి, ప్రతి పేదవాడికి మంచి విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. కానీ అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వం అనుకునే లక్ష్యం నెరవేరడంలో వెనకడుగు వేయవలసి వస్తుంది. అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లుగా అధికారుల తీరు మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని గంగారం గ్రామంలోని గిరిజన పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో గత ఆరు నెలలుగా చిన్నారులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మంచినీటి బోర్ సమస్య కారణంగా చిన్నారులు నీరు లేక అల్లాడుతున్నారు.

### మరమ్మత్తులకు నోచుకోని మోటార్...

జూలూరుపాడు మండలంలోని గంగారం తండా గిరిజన పాఠశాలలో నీటి సమస్య వేదిస్తుంది. పాఠశాల బోరు ఫెయిల్ అవడంతో గత ఆరు నెలలుగా మంచినీటి సమస్య వెంటాడుతుంది. దీంతో పాఠశాల విద్యార్థులు అంగన్‌వాడీ చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల బయట నుండి విద్యార్థులకు మంచి నీటిని బిందెలతో టీచర్లే మోసు కొస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చాలా కాలంగా నీటి సమస్య ఉందని ఉన్నత అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడంలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్ వున్నా అవికూడా రావడం లేదు. పంచాయతీ నీరైనా ఇప్పించాలని పంచాయతీ సిబ్బందిని అడిగినా పట్టించుకోవడం లేదని, ఈ పాఠశాలకు 2 లక్షల 70 వేల రూపాయలు అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద నిధులు మంజూరు అయ్యాయని, ఐనా మంచినీటి సమస్య తీర లేదని ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### భోజనం చేశాక చేతులు కడుక్కోవడానికీ ఇబ్బందే..
### రామా ఖాదర్.. పాఠశాల టీచర్.



గత ఆరు నెలలుగా మోటార్ పనిచేయడం లేదు. ఎన్నోసార్లు ఉన్నతదికారుల దృష్టికి తీసు కెళ్ళాను. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత పిల్లలు ప్లేట్లు కడుక్కునేందుకు పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుండే మంచినీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లకు వెళ్లాలంటే నీరు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మునుముందు తాగునీటి అవసరం మరింత పెరిగే అవకాశం వుంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి, విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నాం.

### మిషన్ భగీరథ నీళ్లు కూడా ఇప్పించడంలేదు :
### శివకుమారి, అంగన్‌వాడీ టీచర్.



గంగారం తండా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రత్యేక భవనం లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపిస్తున్నాను. గత ఆరునెలలుగా మోటార్ పనిచేయకపోవడంతో, కనీసం పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మిషన్ భగీరథ పైపు లైన్ మరమ్మత్తులు చేసి నీరు ఇవ్వమని పంచాయతీ కార్యదర్శిని అడిగినా స్పందించడంలేదు. తప్పని పరిస్థితులలో ఇంటి నుండి బిందెలతో నీళ్లు తెచ్చి పిల్లలకు పోయాల్సి వస్తుంది.

## కొలిక్కొచ్చిన సర్పంచ్ అభ్యర్థుల జాబితా..!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా కొలిక్కి వచ్చింది. అభ్యర్థుల జాబితా సింగిల్ పేరు కోసం గ్రామ పంచాయతీల వారీగా మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సమీక్ష సమావేశాలను నిర్వహించారు. మండలం లోని 32 గ్రామపంచాయతీల ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా గ్రామాల వారీగా సమీక్ష చేశారు. సింగిల్ పేరు తో జాబితా ను సిద్ధం చేసేందుకు కసరత్తు చేపట్టారు. కాగా, ఒకటి, రెండు చోట్ల ఇరువురు అభ్యర్థులు పేర్లు పరిశీలన కు ఇచ్చినట్లు సమాచారం. పోటీ ఉన్న పంచాయతీల పై పరిశీలన కమిటి ప్రతినిధులు "నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు మాజీ చెరున్ శాఖమూరి రమేష్ కొడాలి గోవిందరావులు గ్రామ ముఖ్య నాయకులతో చర్చించారు. మండలం లోని పలు పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు కూడ కార్యచరణ ను రూపొందించారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థిని వ్యతిరేకించే వారిపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గెలుపే లక్ష్యంగా పని చేయాలని ముఖ్య నాయకులకు దయాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొందయ్య, రాయపూడి నవీన్, మెశా శంకర్, వెంకనన, వీరభద్రం, బచ్చలకూరి నాగరాజు, ధీరావత్రాధాకృష్ణమూర్తి, జెర్రిపోతుల అంజిని, మేకల వెంకటేశ్వర్లు, బోయిన వేణు, తన్నీరు కృష్ణమూర్తి, కడియాల నరేష్, నంబూరి రామారావు, పాకనాటి కన్నారెడ్డి, కొమ్మినేని విజయ్బాబు, గుండా బ్రహ్మం, గరిడేపల్లి రామారావు,గొళ్ల శ్రీనివాస్ రావు, గండు సైదులు,మరికంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం సదా శివాలయం వద్ద స్వామి వారి కళ్యాణవేదిక నిర్మాణానికి బుధవారం అర్చకులు ఉప్పల విజయదేవశర్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. జమలాపురం గ్రామానికి చెందిన స్వర్గీయ వీరమాచినేని రామచంద్రరావు కుమారులు వీరమాచినేని సుభాష్‌చంద్రబాబు, వెంకటకృష్ణారావు వితరణతో స్వామి వారి కళ్యాణ వేదిక నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారావు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతి సంవత్సరం శివ కళ్యాణం నిర్వహిస్తున్నామని దానికి ప్రత్యేక వేదికను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి కార్యదర్శి ఎల్వి నారాయణరెడ్డి, ముల్పూరి శ్రీనివాసరావు, గొల్లపూడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి శికుమారి, నిర్మాణ దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలకే పరిమితమైన మర్కోట్ రోడ్డు..!





సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని పర్యటించిన ప్రాంతం....

**ప్రజాపక్షం/కరకగూడెం:** రాష్ట్ర ప్రభుత్వంలో 20022003 సంవత్సరంలో (అప్పట్లో ఖమ్మం జిల్లాలో బూర్గంపాడు నియోజకవర్గంలోని గుండాల, పినపాక మండలాల మధ్య గల) ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఆళ్లపల్లి, కరకగూడెం మండలాల ఏజెన్సీ ప్రజానీకానికి మేలు చేసేలా మర్కోడు నుంచి రేగళ్ల నడుమ గల అటవీ ప్రాంతంలో మట్టి రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో రెండు మండలాల ప్రజలకు రాకపోకలకు అతి తక్కువ దూరంలో మట్టి దారి ఏర్పడింది. సుమారు 80 కిలోమీటర్ల దూర ప్రయాణం తగ్గేలా ఈ దారి ప్రాముఖ్యతను సంతరించుకుంది. రోజులు గడుస్తున్నా కొద్ది ఈ రహదారిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ప్రస్తుతం ఈ దారి అంతా వాసల తాకిడికి, వర్షపు నీళ్ల ఉరవడికి గోతుల, గోతులుగా గుంతలమయంగా మారింది. ఈ మట్టి దారిపై ప్రయాణం చేయాలంటే నరక ప్రాయాన్ని తలపిస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మట్టి దారిని పట్టించుకోని మర మ్మత్తు చర్యలు చేపడితే ఆళ్ళపల్లి, కరకగూడెం మండలాల ప్రజానీకానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పవచ్చు.

### అప్పట్లో అందుబాటులోకి ఆర్టీసీ సర్వీస్...

2003 సంవత్సరంలో అళ్లపల్లి, కరకగూడెం మండలాల ప్రజల రాకపోకలకు అసవుగా ఉండే లా మర్కోడు నుంచి రేగళ్ల ప్రాంతాల నడుమ అటవీ ఏరియాలో ఏర్పాటు చేసిన మట్టి దారి గుండాల ఆర్టీసీ బస్ సర్వీస్ అందుబాటులో ఉండేదని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. చుట్టూ తిరిగి వచ్చే కన్నా ఈ షార్ట్ కట్ దారి ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది అన్నారు. సుమారు 5 నెలల పాటు బస్ సర్వీస్ అందు బాటులో ఉందని, తర్వాత పట్టించుకునే వారు లేకపోవడంతో ఈ దారి గుండాల ఆర్టీసీ బస్ సర్వీస్ సౌకర్యం లేకుండా పోయింది. అలాగే ఈ దారి కూడా శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఈ సందర్భంగా వాపోతున్నారు.

సమస్యల పరిష్కారానికి పాదయాత్రగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఈ ప్రదేశం గుండానే అళ్లపల్లి మర్కోడుకు చేరుకున్నారని స్థానిక గిరిజనులు ఈ సందర్భంగా తెలుపుతున్నా రు. స్థానిక గిరిజనులకు ఈ దారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

### కొత్తగూడెం, ఖమ్మం, ములుగు జిల్లా కేంద్రాలకు ఈ దారి ఎంతో ఉపయోగకరం...

కరకగూడెం మండల ప్రజలు కొత్తగూడెం, ఖమ్మం, ములుగు జిల్లాల కేంద్రాలకు వెళ్లాలంటే మర్కోడు నుంచి రేగళ్ల ప్రాంతాల గుండాల ఏర్పాటుచేసిన ఈ మట్టి దారి స్థానిక ప్రజానీకానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పకనే చెప్పవచ్చు. సుమారు 80 కిలోమీటర్లు దూరం ఈ ప్రాంతం గుండాల ప్రయాణం ద్వారా కలిసొస్తుందని స్థానికులు తెలుపుతున్నారు.

### మేడారం మహా జాతరకు ఈ దారి ఉపయోగకరమే...

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు వెళ్లే భక్తులకు ఈ దారి ఎంతో ఉపయోగకరమని స్థానిక గిరిజనులు తెలుపుతున్నారు. మర్కోడు నుంచి రేగళ్ల ప్రాంతాల రహదారిని పట్టించుకుంటే మేడారం మహా జాతరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకడమే కాకుండా భక్తులకు మరొక దారి అందుబాటులోకి వస్తుందని చెప్పవచ్చు.

### భద్రాచలం ఐటిడిఏ, కానీ స్థానిక ఎమ్మెల్యే కానీ పట్టించుకునేనా..!?

ఆదివాసి గిరిజన ప్రజలకు మేలు చేసేలా భద్రాచలం ఐటిడిఏ వారు సేవలు అమోఘం అనే చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. గిరిజనుల సేవలో తరించే భద్రా చలం ఐటిడిఏ వారు ఆళ్లపల్లి, కరకగూడెం మండలాల మధ్య గల మర్కోడు నుంచి రేగళ్ల ప్రాంతాల నడుము ఏర్పడిన మట్టి రహదారిని పట్టించుకుంటే స్థానిక గిరిజనులకు చెప్పలే నంత మంచి జరుగుతుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా భద్రాచలం ఐటిడిఏ, ఎమ్మెల్యే వారు ఈ మట్టి దారిని పట్టించుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులను హరించే కుట్రను తిప్పికొట్టాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** కార్పొరేట్ సంస్థలకు ఉడిగం చేసేలా రూపొందించిన 4 లేబర్ కోడ్ చట్టాలను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టిబి జికెయస్, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు ఐక్య వేదికగా ఏర్పడి బుదవారం పెద్ద ఎత్తున జియం అఫీస్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్మిక హక్కులకు అత్యంత ప్రమాదకారంగా మారిన ఉన్న లేబర్ కోడ్ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవాలని కోరుతూ మణుగూరు ఏరియా కార్మిక వర్గం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసమే 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని దీనిని కార్మిక వర్గంతో పాటు కార్మిక సంఘాలు కూడా పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఆత్మ నిర్భర్ పేరుతో మోదీ సర్కార్ ఈ చర్యకు పూనుకుందని విమర్శించారు. 4 లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా 2020 నుంచి 2025 జూలై 09 వరకు కార్మిక వర్గం ఐక్యంగా ఏర్పడి దేశ వ్యాప్త సమ్మెలు, పోరాటాలు జరిగాయని అయిన కోట్లాది మంది కార్మికుల నిరసనలు కేంద్ర మోదీ సర్కార్ పరిగణలోకి తీసుకోకుండా కొత్త లేబర్ కోడ్ చట్టాలు తీసుకురావడం బాధాకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నల్ల చట్టాలు వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగేది లేదని టిబిజికెయస్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చే సమరశీలా పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండి మోదీ సర్కార్ కు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, దీశెట్టి రమేష్, మురళీ కృష్ణ, మస్తాన్, చిరుత వెంకటేశ్వర్లు గుగులోత్ రమేష్ నాయక్, పద్దం శ్రీనివాస్,క టారి ప్రసాద్, బక్క సుధాకర్ యాదవ్, రాజేష్, వినోద్ కుమార్, బీరయ్య, ఇమ్రాన్, సాయి, సర్వే నరేష్, ధర్మానందరావు, వెంకట్, నాయుడు సతీష్, సోషల్ మీడియా సైడ్ ఇమ్రాన్ ఖాన్, ఎట్టి సారమ్మ పాల్గొన్నారు.

## ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సంధర్భంగా డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు మండల వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధి జగన్నాధపురంలో బహిరంగ సభకు సంభందించిన ప్రచార కరపత్రాలను ఆదివారం పంచిపెట్టారు. ఈ సంధర్భంగా పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఘన చరిత్రను ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారం లేకపోయినా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ అను నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాం చేసింది కేవలం సిపిఐ పార్టీ మాత్రమేనన్నారు. ప్రజల పక్షాన నిలబడుతూ అనేక ఉద్యమాలను నిర్వహించి ప్రజలకు కార్మికులకు హక్కులు సాధించి పెట్టిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. 1925.12.25వ, తేదీన పార్టీ ఆవిర్భవించన నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు చేసిన సిపిఐ పార్టీ వచ్చే డిసెంబర్ 25 శతాబ్ది ఉత్సవాల ముగింపు సంధర్భంగా నిర్వహించే సభకు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, మేదావులు, అన్ని వర్గాల ప్రజలు సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, మండల కార్యవర్గ సభ్యులు లావుడియా చందూలాల్, శాఖ నాయకులు ధరంసోత్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్ అన్నారు. మంగళవారం అయ్యన్నపాలెం గ్రామంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చొరవతో మహిళలల్లో ఆనందం నింపిందన్నారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు అందజేయటం జరుగుతుందన్నారు. దీని వల్ల మహిళలు వ్యాపార రంగాల్లో ముందు వరుసలో ఉంటారన్నారు. అదే విధంగా బీసీలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఇవ్వటంతో రాష్ట్రంలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు అధికంగా వచ్చాయన్నారు. బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిసి తీరుతామన్నారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సారేపల్లి శేఖర్, సంక శంకర్, బుంగ శ్రీను, అన్వర్, రాములు, లక్ష్మ ణరావు, నున్న శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఇస్లావత్ రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ ఆధార్ కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం లోని ఈఎస్‌డిఇన్ హౌస్ మోడ ల్ ఆధార్ కేంద్రంను తహసీల్దార్ మణిధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మణిధర్ మాట్లాడుతూ అత్యాధునిక ఆధార్ కిట్స్‌తో ఇప్పుడు ఆధార్ సర్వీస్‌లు వేగవంతంగా అందుతాయన్నారు. అశ్వాపురం మండలంలో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా మండలం కేంద్రంలో ఆధార్ సర్వీస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కేంద్రం ఇంచార్జ్ వెలమ రాజేందర్‌కు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరిండెంట్ ఈశ్వర్, ఎంపీఓ ముత్యాలరావు, సీనియర్ అసిస్టెంట్ పద్మావతి, కార్యదర్శి మల్లేష్, ఆధార్ ఆపరేటర్‌లు నైపుణ్య, నవ్య లత, అశ్వాపురం ప్రెస్ క్లబ్ మీడియా మిత్రులు లంకేమల్ల కొండలరావు, తూము చిన్న రాఘవులు, గద్దల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా అశ్వాపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బంది భారత రాజ్యాంగ ఆమోదం పొందిన ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మణిధర్ మాట్లాడుతూ భారతదేశ పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతుత్వం అందిస్తూ రూపొందించిన మన భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26 ఆమోదించబడిన సందర్భంగా నేడు భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనూష, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏడీ రామారావుకు ఘన సన్మానం




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక విద్యుత్ శాఖ ఏఈ కె.రామారావు ఏడీ గా పదోన్నతి పోందిన బదీలీ పై వెళ్తున్న సందర్భంగా బుధవారం ఘనంగా సన్మానించారు. ఏఈ నుంచి ఇల్లందు ఏడీ గా పదోన్నతి పొందిన సందర్భంగా స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో పలువురు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వినియోగదారులకు మంచి సేవలు అందించి ఉత్తమ అధికారిగా పేరుపొందారని ప్రశంసించారు. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు తోళ్ల సురేష్, పట్ట అధ్యక్షుడు గుండెపొంగు శ్రీకాంత్, మద్దెల కాళహస్తి జర్నలిస్టు సంఘం నాయకులు పోలంపల్లి నాగేశ్వరరావు, పెంటమళ్ల కోటయ్య, గంజికుంట్ల వెంకన్న, అత్తులూరి హనుమంతరావు, మల్లెబోయిన ఉపేందర్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తేజావత్ గిరి, బీ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జంటకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని అప్పాయిగూడెం పంచాయితీ బిక్యతండ గ్రామానికి చెందిన ధారావత్ లక్ష్మ ణ్, బుచ్చిల కుమార్తె ఆశ, సురేష్ కుమారుల వివాహ వేడుకకు బుధవారం మాజీ ఎంఎల్ఏ లావుడియా రాములు నాయక్ అనుచరుడు, గిరిజన నేత అజ్మీర వీరన్న హాజరై నూతన జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాలోత్ రాంజీ, బానోత్ పద్మ మోహన్, అజ్మీర అరుణ, గ్రామస్తులు భూక్య లక్ష్మ ణ్ నాయక్, వాంకుడోత్ రమేష్, వాంకుడోత్ లక్ష్మ ణ్, గుగులోత్ రమేష్, బాదావత్ దేవిలాల్, లచ్చు నాయక్, భూక్య రాంకీ తదితరులు పాల్గొని అశీర్వదించారు.

# పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ సత్తా చాటాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండల సిపిఐ సమావేశం పుచ్చకాయల కమలాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రూరల్ మండలంలో సిపిఐ సత్తా చాటాలని అందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అభ్యర్థి ఎవరైనా ప్రతి ఒక్కరూ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రూరల్ మండలంలో రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసి వారి గెలుపుకు నాయకులు కృషి చేయాలన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోడ్ వచ్చింది.. ముసుగు పడింది..!



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో విగ్రహాలకు ముసుగు పడింది. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, లింగాల, చెన్నూరు, పేరువంచ, చంద్రుపట్ల, బత్తులపల్లి, యజ్ఞనారాయణపురం, ఎర్రబోయినపల్లి తదితర గ్రామాలలో గ్రామపంచాయతీ సిబ్బంది విగ్రహాలకు ముసుగు వేశారు. స్థానిక సమరం ముగిసే వరకు ఈ ముసుగులు ఉంటాయని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున నియమావళి ఉల్లంఘిస్తే కేసులు నమోదు అవుతాయని ఆ విధంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ప్రజలకు మరియు కల్లూరు ఎస్సై ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రామస్థాయి నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నట్లు ఎస్సై గ్రామాల్లో నిఘా ఉంచినట్లు ప్రతి గ్రామానికి ఒక పోలీస్ అధికారి ని నియమించినట్లు ఎస్సై వివరించారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పురస్కరించుకుని విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు ఐదు లక్షలకు పైగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రతి ఒక్కరూ సహకారం అందించి విజయవంతం చేయాలని కోరారు. బొమ్మిశెట్టి వెంకటయ్య, నారసాని భారతమ్మ, సిద్ది శ్రీరాములు, పి. శ్రీనివాస్, బుడిగ శ్రీనివాస్, తూము కృష్ణారావు, పి. రమేష్, కన్న, అనంతరాములు తదితరులు విరాళలను అందించారు. ఈ కార్యక్రమంలో ధంసలాపురం, కొత్తగూడెం మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం సహాయ కార్యదర్శి మాకనబోయిన నాగేశ్వరరావు, పగడాల వెంకటేశ్వర్లు, తుమ్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సిరిపురం(కెజి) సర్పంచ్ అభ్యర్థి రేసులో రామకృష్ణ



**ప్రజాపక్షం/వైరాః** సిరిపురం కెజి గ్రామపంచాయతీ పరిధిలోని గౌండ్లపాలెంకు చెందిన బొడ్డు రామకృష్ణత్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. రాజకీయంగా వ్యాపారపరంగా గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్న రామకృష్ణ ఈసారి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలవాలని ప్రజలు ఆశీస్సులు ఉండాలని నామినేషన్ అనంతరం గడపగడపకు ప్రచారాన్ని నిర్వహిస్తానని ప్రజలకు సేవ చేసే సౌకర్యం కల్పించండి అని రామకృష్ణ ప్రజలను కోరుకుంటున్నారు.

## వరి కొయ్యలను కాల్చవద్దు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం నారపనేనిపల్లి గ్రామంలో బుధవారం వైరా డివిజనల్ వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, వ్యవసాయ మండల అధికారి నయన్ మంజుఖాన్, ఏఈవో కీర్తితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వరి కొయ్యలు కోసిన తర్వాత పొలంలోని వరి కొయ్యలను కాల్చిన పొలాల వద్దకు వెళ్లి రైతులతో తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ వరి కొయ్యలను తగలబెట్టడం వలన భూసారం దెబ్బతింటుందని, దీంతో దిగుబడికి ప్రమాదం పొంచి ఉందని అన్నారు. వరికొయ్యలను నీటిలో మురగపెట్టి ట్రాక్టర్స్‌లో దున్నిన తర్వాత అది మురిగి బలంగా మారుతుంది. పొలానికి మంచి దిగుబడి వచ్చే ఇచ్చే విధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకే..

**- ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు**
**- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారి కుటుంబాలకు కౌన్సిలింగ్**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మద్యం సేవించి వాహనాలు నడపుతూ రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధించడమే కాకుండా కేసులు నమోదు చేసి జైలుకుపంపుతామని ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు చోదకులను హెచ్చరించారు. మద్యంసేవించి డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానాలు విధించి వదిలిపెట్టడమే కాకుండా సదరు కుటుంబా వారికి బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఏసిపి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి మత్తులో వాహనాలు నడపటం వలన ప్రమాదాలకు గురై వారి ప్రాణాలకే కాకుండా ఎదుటి వారి ప్రాణాలు కొల్పోవడానికి కారకులవుతున్నారన్నారు. మత్తులో వాహనాన్ని ఇష్టారీతిలో నడిపి ఎదుటి వారిని ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ఒకరి తప్పిదానికి మరోకరు బలవుతున్నారన్నారు. పరోక్షంగా సదరు కుటుంబ సభ్యులు కూడా బాధ్యులవుతారని దీనిని దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడపకుండా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబీకులపై ఉందన్నారు. ఒకే వ్యక్తి పదేపదే మద్యం పేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జారీమానాలు విధించడమే కాకుండా కేసులు నమోదు చేసి వాహనాన్ని సిజ్‌చేసి కోర్టు ఆదేశానుసారం జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## బాధ్యతలు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు విద్యు త్ శాఖ అధికారిగా కె.మహేంద్ర బుధ వారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో పనిచేసిన వెంకట్ బదిలీపై వెళ్ల డంతో ఆయన స్థానంలో మహేంద్ర బా ధ్యతలు చేపట్టారు. దీంతో స్థానిక సిబ్బం ది, స్థానికులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. స్థానిక మండల వాసి కావడంతో సంతోషంగా ఉందని ప్రముఖులు ప్రజా ప్రతినిధులు అభినందించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం మండల విద్యుత్ శాఖ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా విద్యు త్ సమస్యలను నేరుగా తమ దృష్టికి కానీ, సిబ్బందికి గాని తెలియపరచాలని వినియోగదారులను కోరారు.

# పలు కుటుంబాలకు పరామర్శ







**ప్రజాపక్షం/వైరాః** తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం వైరాలో ఎంపి రామసాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఇటీవల మరణించిన చింతనిపు సుధాకర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వాసవి మండపం సమీపంలో ఇటీవల మరణించిన పొల జయలక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆమె కుమారులు పోలా హనుమంతరావు, పోల రాజేశ్వరరావు, పోల వేణుగోపాల్, పోలా శ్రీనులను పరామర్శించి ఓదార్చారు. 14వ వార్డులో అనారోగ్యంతో మరణించిన మోదుగు సుధాకర్ చిత్రపటానికి నివాళులు అర్పించి సుధాకర్ కుటుంబ సభ్యులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ మార్కెట్ చైర్మన్ గుమ్మా రోశయ్య, టెలికాం అడ్వైజర్ మెంబర్ మచ్చా రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేచర్ల సత్యం, ఆత్మ కమిటీ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, కట్ల నాగరాజు, మిట్టపల్లి నాగి, వీరంశెట్టి సీతారాములు, దార్న రాజశేఖర్, గరిడేపల్లి కిషోర్, ఇటుకల భాస్కర్, అయిలూరి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరలక్ష్మికి నివాళి

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పడమట లోకవరంలో మాజీ సర్పంచ్ కొండలరావు తల్లి వరలక్ష్మి(90) మృతితో అదేవిధంగా పుల్లయ్య బంజర లోని బంజరలోని మధ్యాహ్న భోజన కార్మికురాలు దొంగల ఈశ్వరమ్మ మృతి తో వారి గృహాలకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నివాళులు అర్పించారు. లోకవరంలో వరలక్ష్మి భౌతిక దేహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు ఓదార్పును ధైర్యాన్ని ఇచ్చారు. వారి వెంట మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, మేకల కృష్ణ, ఇస్మాయిల్ లక్ష్మణరావు లతో పాటు జిల్లా ఎఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** బిఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు, ఆరెంపుల గ్రామశాఖ అధ్యక్షుడు బండి సతీష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో బండి సతీష్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి రవి, కొండపర్తి రాధాకృష్ణ, మహేష్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, పప్పుల రమణ, జాని, యాకయ్య, కందుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో స్థానిక ఎన్నికలు



**- తొలివిడతకు నేటి నుండి నామినేషన్లు**
**- విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్**

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయితీ ఎన్నికలు పూర్తి రాజ్యాంగబద్ధంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా న్నికల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఓసిలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయితీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో భాగంగా నేటి నుండి నామినేషన్లు స్వీకరణ ప్రారంభం అవుతుందన్నారు. ఉ.10 గం. నుండి సా.5 గం వరకు ఈనెల 29వ తేది వరకు తొలివిడత నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని చెప్పారు. మొదటి విడతలో మారుమూల సమస్యాత్మక ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక,మణుగూరు, కరకగూడెం మండలాల పరిధిలోని 159 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 11వ తేదిన పోలింగ్ నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలు ప్రకటించనున్నట్లు. రెండో విడతలో భాగంగా అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, దుమ్ముపేట,ములకలపల్లి, చుంచుపల్లి, పాల్వంచ మండలాల్లోని 156 గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. 3వ విడతలో భాగంగా ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, లక్ష్మీ దేవిపల్లి, సుజానగర్, ఇల్లెందు మండలాల్లోని 156 జిపిలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 4242 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటి విడతలో 47 నామినేషన్ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు విధుల్లో ఉంటారన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అంతరాయం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలను గుర్తించి పోలీస్ శాఖతో సమన్వయం చేసి బలగాల మోహరింపు, వెబ్ స్ట్రీమింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. తప్పుడు సమాచారంపై నిఘా బలోపేతం చేసామని, అపోహలు, ఉద్రిక్త పరిస్థితులకు ఎలాంటి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, ఇది మున్సిపాలిటీ ప్రాంతాలకు వర్తించదని, దీనిపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రచారానికి సంబంధించి పత్రికాప్రకటనలు, కరపత్రాలు, ప్రచారసామాగ్రి ముద్రణ ఖర్చులను అభ్యర్థులు తప్పని సరిగా వెల్లడించాలి సూచించారు. ప్రింటింగ్ ప్రెస్‌లు, జిరాక్స్ సెంటర్లు ముద్రించిన కరపత్రాలపై ముద్రణ వివరాలు, ప్రతుల సంఖ్య స్పష్టంగా పాటించాలన్నారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాల్లో ఎన్నికలు విజయవంతంగా శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని కార్యచరణలు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

# నామినేషన్లు రిజక్ట్ కాకుండా చూసుకోవాలి




ప్రజాపక్షం/నేలకొండపల్లి : పంచాయతీ ఎన్నికల కు సంబంధించిన నామినేషన్లు తిరస్కరణ కు గురి కాకుండా సవి వివరంగా వివరించాలని నేలకొండపల్లి తహశీల్దార్. వి.వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ఆర్.వో లు అప్రమతంగా ఉండాలని సూచించారు. హెల్ప్ డెస్క్ ద్వారా అన్ని వివరాలను తెలియజేయాలని సూచించారు. నామినేషన్ల ను క్షుణ్ణంగా పరిశీలించాలని, వారికి చైతన్యం కల్పించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. ఈ నెల 30 న గ్రామ పంచాయతీ బోర్డుల వద్దనోటిఫికేషన్ ను అంటించాలని సూచించారు. మూడు రోజుల పాటు నామినేషన్ల ను స్వీకరించాలని పేర్కొన్నారు. స్క్రూట్నీ, విత్ డ్రా, అభ్యర్థుల కు గుర్తుల ప్రక్రియలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలలో ఆర్.వో.లు, ఏ.ఆర్.వో లు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ట్రైనర్ పెద్ది జగన్నాథం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



ప్రజాపక్షం/మణుగూరు: నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మణుగూరులో జిఎం కార్యాలయం వద్ద సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మిక వ్యతిరేక కోడ్ అమలును ఉపసంహరించకుంటే దేశవ్యాప్త ఆందోళన తప్పదని, జెఏసి హెచ్చరిక దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా సింగరేణి జిఎం కార్యాలయం వద్ద సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి నాయకులు షేక్ అబ్దుల్ రవూఫ్ అధ్యక్షతన జరిగిన సభలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, ఐఎన్‌టియుసి, రామ్ నరసయ్య ఏఐటియుసి, వి వెంకటరత్నం సిఐటియు, నాగెల్లి వెంకట్ టీబీజీకేఎస్, ఏనుగు చంద్రారెడ్డి ఐ ఎఫ్ టి యు, ఆర్ మధుసూదన్ రెడ్డి టీయూసీఐ, వెలగపల్లి జాన్ ఐన అసంఘటిత రంగం తదితరులు ధర్నానుద్దేశించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా సంఘటిత అసంఘటితరంగా కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం ఉపసంహరించకుంటే దేశవ్యాప్త ఆందోళన తప్పదని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా అమరుల త్యాగాలతో సాధించుకున్న హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని రాజకీయాలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని వారు గుర్తు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏరియా జిఎం దుర్గం రామచందర్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సిల్వేరు గట్టయ్య, ఎస్ కుమారస్వామి, యస్‌డి నాసర్ పాషా, పుల్లారావు, నాయుడు, జీవరత్నం, గంగాధర్, ఎం శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్వర్లు, నాగయ్య, ఇమాముద్దీన్, ఇంతియాజ్ పాషా, రాజశేఖర్, వీసం శ్రీనివాస్, సందీప్, సాయి నాదాచారి, మస్తాన్ , నరసయ్య, నాగేశ్వరరావు, భూక్యా రమేష్, ఆర్ ప్రసాద్, ఇమ్రాన్, మురళి. పద్దం శ్రీనివాస్, బంగారి పవన్, సాయి కృష్ణ, కాంట్రాక్ట్ కార్మికులు నాగరాజు,రావులపల్లి ముత్తమ్మ, సీత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ రిజర్వేషన్‌లలో బిసిలకు మొండిచెయ్యి



ప్రజాపక్షం/అశ్వాపురం: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరం రానే వచ్చేసింది. ప్రభుత్వం ప్రకటించిన పాత రిజర్వేషన్ల ప్రక్రియలో అశ్వాపురం మండలంలో సర్పంచుల స్థానాల రిజర్వేషన్‌లు 24 గ్రామ పంచాయితీలలో బిసిలు తమకు అనుకూలించిన విధంగా లేదని ఎక్కువ శాతం నేతల నుండి తీవ్ర అసహనం వ్యక్తమవుతుంది. అనుకున్నది ఒకటి అయింది మరొకటి అన్నచందంగా తమ పరిస్థితి మారిపోయింది అంటూ బిసి నేతలు నిరాశ, నిస్పృహ వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎక్కువ శాతంగా మండలంలో ఉన్న బిసి వర్గాల్లో ఈ రిజర్వేషన్ల ప్రక్రియ తీవ్ర నిరాశ మిగిల్చిందనే చెప్పాలి. ఎన్నికల బరిలో పోటీలో దిగేందుకు సర్వం సిద్ధం చేసుకున్న తమకు ఈ రిజర్వేషన్లు భంగపాటును కలగజేసింది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత రిజర్వేషన్‌లలో రిజర్వేషన్ల ప్రక్రియ కొన్ని వర్గాలలో ప్రకంపనలు సృష్టించే విధంగా ఉంది. మండలంలో ఉన్న 24 గ్రామ పంచాయితీలలో అర్ధభాగం గిరిజనేతరులు పూర్వ కాలం నుండి నివసిస్తున్న కూడా సర్పంచుల రిజర్వేషన్లలో బిసి స్థానాలతో లేకపోవడం జనరల్ స్థానాలు ప్రకటించడం బిసిల సంఖ్య అధికంగా ఉన్న చోట ప్రభుత్వం ఆ స్థానాలలో రిజర్వేషన్ల ఒకింత వారిని నిరాశ నిస్పృహలోకి నెట్టేసే విధంగా ఉన్నది. ప్రస్తుతం మండలంలోని అన్ని పార్టీలలో బిసిల సహకారం అందిస్తారా ఎలక్షన్ అభ్యర్థులను పార్టీ వ్యక్తిగా చూస్తారా లేక పట్టించుకోకుండా వదిలేస్తారా అన్న విధంగా ఉన్నది. అన్ని పార్టీలు మండల పరంగా అధికార పీఠం కోసం పోటీ పడతారా ఆ పీఠం రిజర్వేషన్ పరంగా వారు పెట్టుకున్న ఆశలు గల్లంతు చేసిందని వదిలేస్తారా అనేది ఇప్పటి మండల ప్రజల్లో ఉన్న ఆసక్తికర వ్యాఖ్యలు. ఏది ఏమైనా ప్రభుత్వం ప్రకటించిన ఈ రిజర్వేషన్‌లతో అశ్వాపురం మండలంలో బిసి అభ్యర్థుల ఆశలు గల్లంతయ్యాయి అనేది మాత్రం వాస్తవం.

# సేంద్రియ ఉత్పత్తులకు భవిష్యత్‌లో డిమాండ్



**- చరిత ఆర్గానిక్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**

ప్రజాపక్షం/పాల్వంచ : సేంద్రియ ఉత్పత్తులకు భవిష్యత్‌లో మంచి డిమాండ్ పెరుగుతుందని, వాటితో మంచి ఆరోగ్యం కలుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి ( పేటచెరువు ) కొత్తూర్‌లో ఏర్పాటు చేసిన చరిత సేంద్రీయ, కౌజు పిట్టల పెంపకం కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న సేంద్రీయ పద్ధతులు, కౌజుపిట్టల పెంపకం, ఉత్పత్తి ప్రక్రియ, ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేయు విధానాలను, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. యూనిట్‌లో సేంద్రీయ పద్ధతుల్లో తయారుచేసిన మునగాకు ఉత్పత్తులు, చిరు దాన్యాల ఆహార పధార్థాలు, ఇప్పపువ్వు లడ్డూలు, నూనె, లెమన్‌టీ, కారంపొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సబ్బులతో పాటు మొత్తం 102 రకాలైన పదార్థాలను విక్రయిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న వనరులను వినియోగిస్తూ, సోలార్ సిస్టమ్‌తో తయారు చేసిన ఉత్పత్తులను ఎండబెడుతూ రసాయనాలను ఎంత మాత్రం ఉపయోగించకుండా శ్రేష్టమైన పధార్థాలను ప్రజలకు అందిస్తున్నారు. పరిశుభ్రత, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలపై కలెక్టర్ అభినందించారు. సేంద్రీయ పద్ధతుల్లో ఆరోగ్యకరమైన కౌజు పిట్టల గుడ్లు మరియు మాంసం ప్రజలకు అందించటం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఆదరణ పొందటం ఖాయమన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కల్తీ రాజ్యమేలుతుందని దీనితో ప్రజలు అనారోగ్యం పాలవుతూ తాము కష్టపడి సంపాదించుకున్న సంపాదనలో అధిక భాగం ఆసుపత్రులకు పెడుతున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఆర్గానిక్ ఉత్పత్తుల వైపు చూస్తున్నారని చెప్పారు. భవిష్యత్‌లో సేంద్రీయ ఉత్పత్తులకు మంచి గిరాకి ఉంటుందనితెలిపారు. కౌజు పిట్టల పెంపకానికి అవసరమైన దాణాను మార్కెట్ నుండి కొనుగోలు చేయకుండా స్వంతంగా తయారు చేసిన మొక్కజొన్న పిండి, పల్లిచెక్క వంటి స్థానిక వనరులను ఉపయోగిస్తే రైతులకు ఖర్చు తగ్గుతుందని సూచించారు. తద్వారా ఉత్పత్తి నాణ్యత పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కౌజు పిట్టల పెంపకంపై ఆసక్తి పెరుగుతున్నదని, ఇటువంటి యూనిట్లు గ్రామీణులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో కౌజు పిట్టల పెంపకానికి అవసరమైన దాణాను ఇతర ప్రాంతాలకు సరఫరా చేయుటకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చరిత ఆర్గానిక్ కేంద్రం చైర్మన్ జయ, వైద్యులు సోమ రాజుదొర, యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమద్భగవద్గీతా కంఠస్థ పోటీలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గీతా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీమద్భగవద్గీతా కంఠ పోటీలు నిర్వహించారు. బుధవారం టిటిడి దేవస్థానం, ఖమ్మం జిల్లా హిందు ధర్మ ప్రచార పరిషత్ కో ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో విద్యార్థులకు శ్రీమద్భగవద్గీతా కంఠ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి డి. కృషిత, ద్వితీయ బహుమతి కె. హేమహన్విత, తృతీయ బహుమతి ఆర్. రేష్మిత, ప్రత్యేక బహుమతి ఎస్. శ్రీమాన్ లు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగం (ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు)లో ప్రథమ బహుమతి కె. రిషిత, ద్వితీయ బహుమతి కె. శ్రీనిజ, తృతీయ బహుమతి వి. వెన్నెల లు గెలుపొందారు. ఇంటర్మీడియట్స్ సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి ఎస్. వల్లివాగ్దేవి, ద్వితీయ బహుమతి కె. శ్రీనిధి, తృతీయ బహుమతి మోహిత్ కృష్ణ లు గెలుపొందారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ ప్రవచకులు, కవయిత్రి వనం తేజశ్రీ, ఎస్. చంద్రమౌళి, వైదేహి, ఎం. రమాదేవి, ఆర్. లక్ష్మి , సౌమ్యలు వ్యవహరించారు. బహుమతి ప్రధానోత్సవానికి ప్రముఖ వైద్యులు ఎస్‌కె రెహానా బేగం, డాక్టర్ గోవింద క్రాంతి రణదేవ్, డాక్టర్ బి. జ్వలిత తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటువంటి పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం కండి



### ప్రజా పోరాటాలు, ఉద్యమాల స్ఫూర్తితో గెలుపుకు కృషి చేయాలి : సాబీర్ పాషా

**ప్రజాపక్షం/మణుగూరు :** రేపు జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో సీపీఐ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలని, దీని కోసం సిద్ధం కావాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం సీపిఐ పినపాక నియోజక వర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతనేని సురేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా షేక్ సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ నియోజకవర్గం లో బలమైన క్యాడర్ కలిగిన పార్టీ సిపిఐ అని, ఈ నియోజకవర్గం అభివృద్ధి లో సిపిఐ పాత్ర ఎనలేనిదని, ఎమ్మెల్యేలుగా, ఎంపి లుగా, జట్పిటిసి, ఎంపిపిలుగా గెలిచి నియోజకవర్గం అభివృద్ధిలో సిపిఐ కృషి ఉందని, పొత్తు ధర్మం తో ఎన్నికల కు వెళ్తామని వారు అన్నారు. పోటీ చేసే సీట్లలో గెలవటానికి అందరూ కష్టపడి పని చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నా లక్ష్మీ కుమారి, రేసు ఎల్లయ్య, కమటం వెంకటేశ్వరరావు, మువ్వా వెంకటేశ్వరరావు, దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, ఎడారి రమేష్ పత్తిపాటి నాగేశ్వరరావు, గడ్డం మనోహర చారి, పేరాల శ్రీనివాస్, సబ్కా నాగేశ్వరరావు, వాగబోయిన రమేష్, కామిశెట్టి రామారావు, వంగర సతీష్, అన్ని మండల బాధ్యులు, కార్యవర్గ సభ్యులు హాజరైనారు.

# లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



### - చట్టం ప్రతులు దగ్ధం
### - వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, నిరసన

**ప్రజాపక్షం/పాల్వంచ :** కార్పోరేట్ కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకొని రద్దు చేయాలని సిపిఐ అనుబంధ రైతుసంఘం జాతీయ నాయకులు ముత్యాల విశ్వనాధం డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో వామపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుదవారం ధర్నా నిర్వహించి చట్టం ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులు ఉద్యోగ భద్రతను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో రైతు సంఘాల నేతృత్వంలో సుమారు రెండేండ్లకు పైగా ఢిల్లీలో రైతులు శాంతియుత పోరాటం చేశారని దీనితో తలొగ్గిన కేంద్రం ఉపసంహరించుకొంటామని హామీ ఇచ్చి దొంగచాటుగా అమలుకు పూనుకోవటం సిగ్గుచేటన్నారు. రైతాంగ నమ్మకాన్ని వమ్ముచేసి, నమ్మక ద్రోహం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చరిత్ర క్షమించదని మండిపడ్డారు. అనంతరం సిపిఎం అనుబంధ సిఐటియు రాష్ట్ర నాయకులు దొడ్డా రవికుమార్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్, న్యూడెమోక్రసీ అనుబంధ ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం బడా పారిశ్రామిక వర్గాలకు, కార్పోరేట్ వర్గాలను అనుకులంగా చట్టాలను రూపొందించి, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని మండిపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశ ప్రజలను మోసం చేస్తూ అంబాని, ఆదాని, లలిత్‌మోడీ, విజయ్‌మాల్యా, టాటాబిర్లా లాంటి వారికి అనుకూలమైన చట్టాలను అమలు చేస్తున్నారంటూ, కరోనా సమయంలో తెచ్చిన రైతు, కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ దాదాపు రెండు సంవత్సరాలకు పైగా రైతులు ఢిల్లోలో వీధుల్లో శాంతియుతంగా సమ్మెక చేశారన్నారు. సమ్మెలో పాల్గొన్న 750 మంది రైతులు అసువులు బాశారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి విభజించు పాలించు అన్న రీతీలో ప్రధాన మంరత మంత్రి మోడీ పాలను సాగిస్తున్నారని దేశంలో కమ్యూనిస్టులను అంతం చేయటానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని దీనితో మావోస్టులను అంతం చేసేందుకు కేంద్ర సాయుధ బలగాలను రంగం లోకి దించి ఎన్‌కౌంటర్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తుందని, చర్చలకు సిద్ధమని మావోయిస్టుల ప్రతిపాదనను సైతం అంగీకరించకుండా ఏకపక్షంగా కాల్పుల మోతమోగిస్తుందని ఆరోపించారు. అత్యంత విలువైన అటవీ సంపదను బడాపారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకు కాల్పులకు తెగబడుతుతూ హత్యాకాండను సాగిస్తుందన్నారు. రైతు, కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని లేని యెడల ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పి. తులసీరామ్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, కోరె క్రిష్ణ, వీసంశెట్టి పద్మజ, సత్యవేణి, బి. మాధవి, ఎస్‌స్. నిరంజన్, కొంగర అప్పారావు, వైఎస్ గిరి, విజయ్, రంజిత్, వీరన్న, పగిడిపల్లి సంజీవరావు, బిక్కూలాల్, వెంకటేశ్వర్లు, రవి, సతీష్, వెంకన్న పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్లు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత నామినేషన్లను నేటి నుంచి స్వీకరించనున్నారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా మొదటి విడతలోనే డిసెంబర్ 11న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి 29 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల స్వీకరణకు మొత్తం మండలంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాపటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాపటపల్లి విఆర్‌బంజర జికె బంజర గ్రామాలకు సంబంధించి, చిమ్మపుడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చిమ్మపుడి కోటపాడు గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లను స్వీకరించనున్నారు. మంచుకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంచుకొండ బూడిదంపాడు పువ్వాడనగర్, రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రఘునాథపాలెం చింతగుర్తి గణేశ్వరం, వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వి. వెంకటాయపాలెం వేపకుంట్ల చెరువుకొమ్ముతండా గ్రామాలకు సంబంధించి నామినేషన్లను స్వీకరించనున్నారు. మల్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మల్లేపల్లి జింకలతండా పరికలబోడు, హర్యాతండా పంచాయతీ కార్యాలయంలో బావోజీతండా రాములుతండా హర్యాతండా గ్రామాలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించనున్నారు. రాంక్యాతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాంక్యాతండా పుఠానితండా సూర్యాతండా, ఈర్లపుడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈర్లపుడి కొర్లబోడు తండా బద్యాతండా, దొనబండ పంచాయతీ కార్యాలయంలో దొనబండ లచ్చిరాంతండా, కెవి బంజర గ్రామ పంచాయతీ కార్యాలయంలో కెవి బంజర మూలగూడెం మంగ్యాతండా, పంగిడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంగిడి రజబ్‌అలీ నగర్ ఎన్‌వి బంజర గ్రామాలకు సంబంధించి సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్లకు సంబంధించి ఆయా కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు.

# పారదర్శకంగా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలి

### -ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి బుధవారం సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై వచ్చిన అప్పీళ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వివిధ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల పాటు అర్టిఐ కమిషనర్ నియామకం కాకపోవడంతో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించేందుకు జిల్లాల పర్యటన చేపట్టామన్నారు. ఆర్టిఐ చట్టంపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించామన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలన్నారు. సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టమన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి శాఖ తమకు వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను సకాలంలో డిస్పోజ్ చేయాలన్నారు. ప్రతి అధికారి తమ శాఖ పరిధిలో సమాచార హక్కు చట్టం దరఖాస్తుల వివరాలతో కూడిన రిజిస్టర్ మెయింటెన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎంఎ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థుల ఎంపికకు కసరత్తు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడడంతో పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలు పెట్టారు. మండలంలో మొదటి విడతలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పోటీ చేసే ఆశావాహులను గుర్తించి అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించారు. గురువారం నుంచి నామినేషన్లు ప్రారంభం కానుండడంతో అన్ని పార్టీలు సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డులకు సంబంధించి అభ్యర్థులను రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసేందుకు చర్చలు చేపట్టారు. జనరల్ స్థానాలతో పాటు రిజర్వేషన్ స్థానాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తుండడంతో అధికార పార్టీకి అభ్యర్థి ఎంపిక తలనొప్పిగా మారింది. అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా పని చేయాలని అధికార పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, బిజెపిలు అభ్యర్థుల ఎంపికపై గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. అన్ని పార్టీలు గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. మొత్తంగా ఎన్నికలు రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. పోటీ చేసే అభ్యర్థులు తమకు అనుకూలమైన వారితో సంప్రదింపులు మొదలుపెట్టారు.

# సత్తుపల్లి జిఎం కార్యాలయం ముందు ధర్నా




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** కార్మిక భద్రతా చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చిన కేంద్ర నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు జే.ఏ.సీ ఐక్య కార్మిక సంఘాల ఆద్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. కార్మికుల హక్కులను రక్షించేందుకు రూపుదిద్దుకున్న అనేక కార్మిక చట్టాలను చెల్లాచెదురుగా చేసి, వాటిని నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, వాటి అమలును వెంటనే రద్దు చేయాలని జే.ఏ.సి ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ డిమాండ్ చేస్తూ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు జే.ఏ.సీ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, రద్దు చేయాలని ఆందోళన కార్యక్రమం నిర్వహించి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. సత్తుపల్లి కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికులను తక్కువ జీతాలతో, హక్కులు లేని వాతావరణంలో కట్టుబానిస కార్మికులుగా మార్చేందుకు కార్పొరేట్ ప్రోత్సాహంతో కేంద్ర ప్రభుత్వం 29 కార్మికుల భద్రత చట్టాలను మార్చిందని తీవ్రంగా విమర్శించారు. నాలుగు కోడ్స్‌లో ఉన్న మార్పులు కార్మిక భద్రత, జీతభత్యాలు, కార్మిక హక్కులు, యూనియన్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో కీలకమైన కార్మిక వర్గాన్ని బలహీనపరచే ఈ నిర్ణయం వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# కారు బైక్ ఢీ.. ఒకరు మృతి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఆళ్లపల్లి మండల పరిధిలోని అనంతోగు గ్రామ శివారులో బుధవారం సాయంత్రం 6:30గంటల సమయంలో ఆళ్లపల్లి నుండి కొత్తగూడెం వెళ్తున్న కారు మండలం కొప్పురాయ్ గ్రామానికి చెందిన జార రమేష్(28)ఆళ్లపల్లికి వస్తున్న సమయంలో మార్గమధ్యలోని అనంతోగు గ్రామ శివారులో కారు బైక్ ఎదురెదురుగా ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. కార్ డ్రైవర్ పరారీలో ఉన్నారని స్థానిక ఎస్ఐ ఎం సోమేశ్వర్ తెలిపారు.